క్లుప్తంగా

వరిగడ్డి వామి దగ్ధం


గడ్డివామి నుంచి ఎగిసిపడుతున్న మంటలు

కుంకలమర్రు (కారంచేడు): మండలంలోని కుంకలమర్రు గ్రామంలో శుక్రవారం వేకువజామున జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 10 ఎకరాల వరిగడ్డి వామి దగ్ధమయ్యింది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామంలోని కాలువ కట్ట మసీదు సమీపంలో పశువుల కోసం నిల్వ చేసుకున్న వరి గడ్డి వామి అర్ధరాత్రి దాటిన తరువాత మంటలు వ్యాపించాయి. ప్రమాదం ఎలా జరిగిందో తెలియలేదు. స్థానికులు గమనించి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. చీరాల నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు. గడ్డి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని అంచనా. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది వచ్చి సమాచారం సేకరించారు.

ప్రశాంతంగా జరుగుతున్న పది పరీక్షలు

కారంచేడు: పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షలకు మండలంలోని కుంకలమర్రు, కొడవలివారిపాలెం, స్వర్ణ ఉన్నత పాఠశాలలకు చెందిన 144 మంది విద్యార్థులకుగాను 141 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎగ్జామ్ చీఫ్ జెల్లి శేఖర్‌బాబు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ జీ భాస్కరరావులు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కాపీయింగ్‌లకు పాల్పడకుండా పటిష్ట జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

437 మంది హాజరు..

చినగంజాం: మండలంలోని చినగంజాం, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో శుక్రవారం నిర్వహించిన లెక్కలు పరీక్షకు మొత్తం 437 మంది హాజరయ్యారు. చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 287 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 265 మంది హాజరయ్యారు, వారిలో 22 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా ఏపీ సుబ్బారావు, డిపార్ట్‌మెంట్ అధికారిగా కే మెరియస్‌బాబు వ్యవహరించారు. అదే విధంగా కడవకుదురులో 174లో 172 మంది హాజరయ్యారు. కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా డీ హేమంత్ కుమార్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు.

ఘనంగా సత్యన్నారాయణ స్వామి వ్రతాలు


వ్రతాలలో పాల్గొన్న దంపతులు

స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం సత్యన్నారాయణ స్వామి వ్రతాలను కన్నుల పండువగా నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి ఆలయ 48వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుతున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏవీఎస్ బ్రదర్స్ సహకారంతో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాల అనంతరం సుమారు 1500 మంది భక్తులకు అన్నదాన సంతర్పణ నిర్వహించారు.

వృద్ధుడిపై దాడి కేసు విచారణ


విచారణ చేపడుతున్న నిజనిర్ధారణ కమిటీ

బల్లికురవ: పోలీసులు అక్రమ కేసు బనాయించి వృద్ధుడనే కనికరం కూడా లేకుండా దాడిచేశారని బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి దుర్గాభవాని ఫిర్యాదు చేసింది. ఈఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం విజయవాడకు చెందిన స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కిషోర్, హరీష్, నాగేంద్ర, ఐశ్వర్య, దుర్గా భవాని చెన్నుపల్లి వెళ్లే రోడ్డులో నిర్వహిస్తున్న షాపు, ఇంటి వద్ద, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా విచారణ చేపట్టారు. అధికారులు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కమిటీ కోరారు.

లాడ్జి ముందు ఉంచిన బైకు మాయం

మార్టూరు: మార్టూరులోని ఓ లాడ్జి ముందు నిలిపి ఉంచిన ఓ బైకు అదృశ్యమైన విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. హెడ్ కానిస్టేబుల్ సాయిరాం వివరాల మేరకు.. మార్టూరు కిషోర్ కాలనీకి చెందిన మల్లా వాసు ఈనెల 15వ తేదీ ఉదయం స్థానిక నాగరాజుపల్లి రోడ్డులో గల బీఎస్ఆర్ లాడ్జి ముందు తన పల్సర్ బైకును నిలిపి ఉంచి పని మీద వెళ్లాడు. తరువాత వాహనం కోసం వచ్చిన వాసు కొత్త పల్సర్ వాహనం కనిపించలేదు. బైకు గురించి ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో వాసు శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పల్సర్ బైకును రూ.90 వేలకు కొనుగోలు చేసినట్లు బాధితుడు తెలిపాడు.


జాలమ్మ గుడి వద్ద కరణం వెంకటేష్‌కు హారతులు పడుతున్న మహిళలు


ఎంజీసీ మార్కెట్‌లో వినాయకుడి గుడి వద్ద పూజలు నిర్వహిస్తున్న కరణం వెంకటేష్

ఆదరించండి అండగా ఉంటాం..

- అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్ జోరుగా ప్రచారం
- పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించిన వెంకటేష్


జాలమ్మ గుడి వద్ద కరణం వెంకటేష్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

చీరాల: తన తండ్రి కరణం బలరామకృష్ణమూర్తి మాదిరిగా తనను కూడా ఆదరించాలని.. అండగా తాను ఉంటానని వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ ఓటర్లను కోరారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో ఆయన ప్రచారం నిర్వహించారు. అలానే పలు దేవాలయాలలో పలు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలు అధికంగా ఉన్న చీరాల ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, వచ్చే ఎన్నికలలో తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. మీ అందరి మద్దతుతో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి జననేత జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. తమ పరిపాలనలో ఎటువంటి అభివృద్ధి జరిగిందో నియోజకవర్గ ప్రజలందరూ చూశారని, విద్వేష రాజకీయాలకు తావు లేకుండా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేస్తానన్నారు.


ముత్యాలపేటలో మహాలక్ష్మమ్మ గుడి వద్ద పూజలు నిర్వహిస్తున్న కరణం వెంకటేష్

మరోసారి ప్రతి గడపకు వెళ్లి మీ అందరిని కలుస్తానని ఆయన అన్నారు. పట్టణంలోని 23వ వార్డులోని జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో వెంకటేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కోండ్రు బాబ్జి, మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, గుడి కమిటి సభ్యులు సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, చిన్న వెంకారెడ్డి, చెంచురెడ్డి, మోహనరావు, గ్రంధి స్వాములు, నాగరాజు, బక్క అద్దంకిరెడ్డి, బక్క శివప్రసాద్‌రెడ్డి, కోడూరి ప్రసాద్ రెడ్డి, వేటగిరి శేఖరరెడ్డి, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు. ముత్యాలపేటలోని శ్రీమహాలక్ష్మమ్మ అమ్మవారి చెట్టు వద్ద పూజా కార్యక్రమంలో పూజలు నిర్వహించి అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు తోకల అనిల్, గోలి స్వాతి, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, చీమకుర్తి బాలకృష్ణ, గోలి జగదీష్, ఎస్.సత్యానందం, పార్టీ నాయకులు చిలుకోటి శ్రీనివాసరావు, మామిడాల సుబ్బారావు, వాసిమల్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీసీ మార్కెట్‌లో...

చీరాల ఎంజీసీ మార్కెట్‌లోని వినాయకుని గుడి వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో వెంకటేష్ పాల్గొని పూజలు నిర్వహించి అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడారు. మార్కెట్‌లోని పలువురు వస్త్రవ్యాపారులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. చీరాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో చిన్ని లీలాధరరావు, వేముల చంద్రశేఖర్, శీరాం వేణు, తాతా కుమారస్వామి, కోట శ్రీమన్నారాయణ, గుంటూరు మాధవరావు, శీరాం బుజ్జి, తులాబందు సురేష్, పోలిశెట్టి వేణుగోపాలరావు, శివ, మద్దు వెంకట సుబ్బారావు, చేబ్రోలు బాబాజీరావు, అరవపల్లి లీల, పేరకం బుజ్జి, సంక రవి, పల్లపోతు సుబ్బయ్య, బి.నారాయణ, బీవీ సుబ్బయ్య, బాలు, చంద్రమౌళి, నారాయణమూర్తి పాల్గొన్నారు.

మార్టూరులో పూజలు చేసిన యడం బాలాజీ


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో శుక్రవారం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక బొడ్డురాయి సెంటరులో నిర్మించిన ఆలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి, గోపుర కలశం, మహావతార్ బాబా విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రతిష్ఠించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు, మండల ఆర్యవైశ్య కమిటీ సభ్యులు, వాసవీ మహిళా మండలి సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి


శిబిరానికి హాజరైన రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

బల్లికురవ: వాతావరణంలో మార్పులతో సీజనల్ జ్వరాలు, చికున్ గున్యా వ్యాధులు విజృంభిస్తున్నాయని ప్రజలు తగు జాగ్రతలు తీసుకోవాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి. భారతి కోరారు. శుక్రవారం కూకట్లపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరంలో భాగంగా 106 మందికి వివిధ రకాల పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. వేసవి ఎండలు రోజురోజుకు పెరుగుతున్నందున వృద్ధులు చిన్నారుల ఆరోగ్యం పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో ఎండ సమయంలో వడదెబ్బకు గురైతే సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకోవాలని కోరారు. గ్రామంలో లభించే మంచినీటిని పరీక్షలకు పంపుతున్నట్లు వైద్యాధికారి వివరించారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ హెచ్‌ఈవో పీ. శ్రీనివాసరావు, సీహెచ్‌వో మంజూషా ఎఎన్ఎంలు అనిల్‌కుమార్, సుజాత, ఝాన్సీ ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

కార్మికులకు పారిశుద్ధ్య పరికరాలు అందజేత


డస్ట్‌బిన్లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

పర్చూరు (యద్దనపూడి): పర్చూరు గ్రామ పంచాయతీకి చెత్తను సేకరించేందుకు పర్చూరు రోటరీ క్లబ్ అనుబంధ సంస్థ సపోర్ట్ ఆర్థిక సహకారంతో రూ.70 వేల విలువైన 80 డస్ట్‌బిన్లను గ్రామపంచాయతీ కార్మికులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత గురించి రోటరీక్లబ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి సేకరించిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తేలికగా చెత్తను తరలించేందుకు ఈ డస్ట్‌బిన్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పంబి. సదానందరెడ్డి, సీనియర్ సభ్యులు పాబోలు ఉదయ్ భాస్కర్ కార్మికులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న క్లబ్ సభ్యులు

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ నీలఖంఠపురంలో గల అనాథ వృద్ధ శరణాలయంలో చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు శుక్రవారం అన్న దానం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు మాట్లాడుతూ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా అనాథ వృద్ధులకు అన్నదానం చేశామన్నారు. అనాథ వృద్ధులను ఆదుకోవడం మానవతా ధర్మమన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చీరాల కృష్ణమూర్తి, జి వై ప్రసాద్, డీవీ సురేష్, మల్లేశ్వరరావు, గుత్తి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

నారాయణరావుకు ఉగాది పురస్కారం


నారాయణరావు

అద్దంకి రూరల్: గుంటూరులోని అమరావతి సాహితీ మిత్రులు సంస్థ నిర్వహించనున్న ఉగాది పురస్కారాలకు బాపట్ల అద్దంకికి చెందిన ప్రముఖ వచనకవి, సాహితీ స్రవంతి అధ్యక్షుడు చందలూరి నారాయణరావుకు ఉగాది పురస్కారాన్ని అందజేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు రావి రంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా కవులు ఆర్‌వీ రాఘవరావు, అన్నమనేని వెంకటరావు, గాడేపల్లి దివాకరదత్తు, డీవీఎం సత్యనారాయణ, మిట్టాకామేశ్వరశర్మ, ఇలపావులూరి శేషతల్పశాయి, మోటుపల్లి రామదాసు, బాలు, బీ.అంజయ్య,జీ. శేషగిరి పలు సాహితీ సంస్థలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కంపెనీ నగదు వాడుకున్న విషయమై కేసు

మార్టూరు: ఓ కంపెనీలో మేనేజరుగా పని చేస్తూ సంస్థ సొమ్ము దుర్వినియోగం చేశాడనే విషయమై సంస్థ మేనేజరుపై స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదు అయింది. సీఐ ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి వివరాల మేరకు.. మండలంలోని బొబ్బేపల్లి గ్రామానికి చెందిన విప్పర్ల లాజరు అనే యువకుడు గతంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థలో మార్టూరు బ్రాంచి మేనేజరుగా పని చేశాడు. అందులో భాగంగా రూ.6.47 లక్షల విలువైన కాంప్లెక్సు ఎరువులను రైతులకు విక్రయించిన లాజరు ఆ మొత్తాన్ని తన సొంతానికి వాడుకున్నాడు. అనంతరం రూ.4.50 లక్షలు సంస్థకు తిరిగి చెల్లించాడు. లాజరు మిగిలిన మొత్తం చెల్లించలేదు. ఈ క్రమంలో సంస్థ పైఅధికారి సాకిబండ రాజేష్, లాజరు నిధుల దుర్వినియోగానికి పాల్పడిన విషయమై శుక్రవారం మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు.

కుక్క అడ్డు రావడంతో వ్యక్తికి గాయాలు

అద్దంకి రూరల్: కుక్క అడ్డు రావటంతో ద్విచక్రవాహన దారుడికి గాయాలయ్యాయి. ఈఘటన శుక్రవారం రాత్రి అద్దంకి మండలం బొమ్మనంపాడులో చోటుచేసుకుంది. అందిన సమాచారం ప్రకారం మండలంలోని గుర్రంవారిపాలెం గ్రామానికి చెందిన ఉయ్యాల సుధాకర్ గ్రామం నుంచి ద్విచక్రవాహనం మీద అద్దంకికి వస్తున్నాడు. మార్గమధ్యంలో కలవకూరు రోడ్డులోని బొమ్మనంపాడు జంక్షన్ వద్దకు రాగానే కుక్కఅడ్డు రావడంతో బైకు అదుపుతప్పి కిందపడటంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

సువిధ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

నాగులుప్పలపాడు: సాధారణ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఏ రాజకీయ పార్టీ అయినా తమ ప్రచారాలకు, సభలకు, మైక్‌లు ఏర్పాటు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న సువిధ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అనుమతి కోసం నమోదు చేసుకోవాలని అసిస్టెంట్ ఎన్నికల అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఆఫ్ లైన్ ద్వారా 48 గంటల ముందుగా సంతనూతలపాడు నియోజకవర్గ ఎన్నికల అధికారి వద్ద అనుమతి తీసుకోవాలని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రచారాలు, సభలు నిర్వహించినా ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


చీరాల పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, పారా మిలటరీ బలగాలు

మేదరమెట్ల: ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి అన్నారు. సీఐ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందువల్ల ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్‌ను పాటించాలన్నారు. రాజకీయ నాయకుల ఫొటోలు పార్టీ గుర్తులను కలిగిన ఫ్లెక్సీలను తొలగించాలని, గోడమీద బొమ్మలు వేయడం నేరమన్నారు. సెక్షన్ 30 యాక్టు అమలులో ఉందని అందుచేత సభలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచార కార్యక్రమాలను చేయకూడదన్నారు. అనుమతులు లేకుండా మైక్ వాడటం నేరమన్నారు.

చీరాల టౌన్: స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శృంగారిపేట, ఆనందపేట, జక్కువారి స్ట్రీట్, ఐఎల్‌టీడీ, మసీద్ సెంటర్, పేరాలలో సీఐ జి. సోమశేఖర్, ఎస్ఐ లు మురళీ, వెంకటేశ్వర్లు, సిబ్బంది ఆధ్వర్యంలో పారా మిలిటరీ బలగాలు కవాతు నిర్వహించారు. జరగబోయే ఎన్నికల్లో శాంతి,భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

పేదలకు అండగా వైఎస్సార్ సీపీ


బీసీ కాలనీలో కాలనీ వాసులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

జే.పంగులూరు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎల్లప్పుడు వైఎస్సార్ సీపీ కృషిచేస్తుందని పంగులూరు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బిజ్జం శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పంగులూరు శుక్రవారం బీసీ కాలనీలోని కాలనీవాసులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలసుకున్నారు. ఈ సందర్భంగా బిజ్జం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని కోరారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన పారుమంచి పెద్దకోటయ్య మృతదేహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం రామారావు, ఎంపీటీసీ సభ్యులు నూతలపాటి రాములు వీరరాఘవులు, కోఆప్షన్ సభ్యులు ఖాశిం ఖాన్, గ్రామ నాయకులు ముప్పనేని శ్రీను, రావూరి శ్రీను, నాగబోయిన తిరపతియ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

చీరాల అర్బన్: వేసవిలో ప్రజలకు విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని ఎస్ఈ సత్యనారాయణ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చీరాల వచ్చిన ఆయన ఈఈ కార్యాలయంలో అధికారులుతో మాట్లాడారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేయాలన్నారు. విద్యుత్ అధికారులు ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. ప్రతి సమస్యను ముందుగా గుర్తించి మరమత్తులు చేసి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ లైన్ల జీఐఎస్ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలానే ప్రతి ఎలక్షన్ బూత్‌లను సందర్శించి విద్యుత్ సరఫరా ఉండేటట్లు చూడాలన్నారు. సమావేశంలో చీరాల డివిజన్ ఈఈ కె.జాన్ థామస్, సబ్‌డివిజన్‌ల డిఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నీటి పొదుపు భవిష్యత్ తరాలకు వరం

- ప్రపంచ నీటి దినోత్సవం

చీరాల రూరల్ : భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీవో శర్మ పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అక్కాయపాలెం పంచాయితీ కార్యాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోని అనేక దేశాలు తాగటానికి మంచినీరు లేక అల్లాడిపోతున్నాయని చెప్పారు. మన దేశంలో కూడా అనేక ప్రాంతాలు, పట్టణాలు, నగరాలు పెద్ద పెద్ద సిటీలు మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఆధునికత మోజులో ఉన్న చెట్లు, అడవులను నరికి కాంక్రీటు నిర్మాణాలను చేపట్టడం వలన భూమిలో నీటి జాడ మచ్చుకైనా కనపడడం లేదని చెప్పారు. ప్రస్తుతం ప్రతి ప్రాంతంలో మంచినీటి మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేసి భూగర్భ జలాలను ఇష్టానుసారంగా దుర్వినియోగం చేస్తూ వాల్టా చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారని చెప్పారు. రానున్న రోజులలో మంచి నీటి కోసం ప్రపంచ దేశాలు యుద్ధాలు కూడాచేసే పరిస్థితి తలెత్తుతుందని ఆయన చెప్పారు. అందువలన ప్రతి ఒక్కరూ నీటిని ఎంతో పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. సదస్సులో న్యాయవాదులు జీకే ఈశ్వరి రెడ్డి, స్నేహలు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన న్యాయ సలహాలను గురించి వివరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సూపరింటెండెంట్ రమా కుమారి, పారా లీగల్ వలంటీర్ మతీన్, పంచాయితీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

చీరాల అర్బన్: నీటిని మనం జాగ్రత్తగా వినియోగించుకోవాలని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.మురళి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాలలోని జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ జలదినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన జల దినోత్సవం విశిష్టతను, ఆవశ్యకతను వివరించారు. భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యలను విద్యార్థినులకు వివరించారు.కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది జాన్‌రాజ్, చిన్నారావు, రామరాజు, బండారు రాజు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెపాడులో ప్రతిష్ట మహోత్సవాలు


ప్రతిష్టకు ఏర్పాటు చేసిన మండపం

బల్లికురవ: మండలంలోని గొర్రెపాడు గ్రామంలో అభయాంజనేయస్వామి, బాలాంజనేయస్వామి, గణపతి విగ్రహాల వాయుప్రతిష్టను బుధవారం ఉదయం 8.14 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. గ్రామస్తుల సమష్టి కృషి సుమారు రూ.30 లక్షలతో కొండకు ఉత్తర భాగంగాలో ఒకే మండపంపై మూడు విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతిష్ఠాచార్యులు ఓరుగంటి సీతారామశాస్త్రి, జే శ్రీనివాసమూర్తి, బృందంచే సోమవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం రక్షాబంధనం, మృత్యుంజయ గ్రహణం సాయంకాలం విగ్రహాలను గ్రామోత్సం చేపట్టనున్నారు. మంగళవారం విగ్రహాలకు జలాధి, ధాన్యాధివాసాలు, బుధవారం ఉదయం 8.14 గంటలకు మంత్రాలతో ప్రాణ ప్రతిష్ఠ, అనంతరం అన్న సంతర్పణ చేపట్టనున్నట్లు చెప్పారు. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో గ్రామస్తులు, భక్తులు పాల్గొని పరిసర గ్రామస్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు మేలు


పౌష్టికాహార కిట్లపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కృష్ణకుమార్

దగ్గుబాడు (కారంచేడు): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా అందించే పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవడం వలన గర్భిణులు, బాలింతలు, చిన్నబిడ్డలకు ఎంతో ఆరోగ్యం చేకూరుతుందని దగ్గుబాడు పీహెచ్‌సీ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ పీ కృష్ణకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని దగ్గుబాడు గ్రామంలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో పాల్గొని పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించాల్సి పథకాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్వర్ణ సెక్టార్ సూపర్‌వైజర్ సునీత, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి మాధురి, మునీషా, సరోజినీ, సులోచన, హెచ్ఎం బెనజీర్‌బుట్టో, ఆయుష్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలకు, చిన్నబిడ్డల తల్లులు పాల్గొన్నారు.